క్లుప్తంగా

ఉత్సవమూర్తుల ఊరేగింపు



చౌడేపల్లె: మండలకేంద్రంలోని పురవీధుల్లో సీతారామలక్ష్మణ హనుమాన్ ఉత్సవమూర్తులను శనివారం ఊరేగింపు చేపట్టారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాల నడుమ పల్లకిలో ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద ఉత్సవమూర్తులకు ప్రజలు పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. యూత్ కమిటీ నిర్వాహకులు ఉన్నారు.

గోకులం షెడ్ల రంగులపై కమిషనర్ ఆగ్రహం



గోకులం షెడ్లకు వేయాల్సిన రంగులివీ

సాక్షి ఎఫెక్ట్..

కుప్పం: గోకులం షెడ్లకు వేసిన రంగులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 20వ తేది సాక్షి దినపత్రికలో 'పచ్చపైత్యం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ చైతన్య స్పందించారు. చిత్తూరు జిల్లాలో గోకులం షెడ్లకు వేసిన పసుపు రంగులు మార్చాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ గోకులం షెడ్లుకు టెర్రా కోట రంగులు వేయాలని జిల్లా కలెక్టర్లుకు, డ్వామా పీడీకి ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. అధికార పార్టీ సంబంధించినా పసుపు కలర్‌ను గోకులం షెడ్లుకు వేయడంపై రాష్ట్రస్థాయి అధికారులకు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే షెడ్లుకు టెర్రా కోట రంగులు వేయాలని సూచించినట్లు సమాచారం.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- వి.కోట పట్టణంలో రూ.12 లక్షలతో డ్రైనేజీ పనులు
- సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సర్పంచ్ లక్ష్మి



కాలువ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు

వి.కోట: పట్టణంలోని భారత్ నగర్ వాసులు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, మేజర్ పంచాయతీ సర్పంచ్ పీఎస్ లక్ష్మి శాశ్వత పరిష్కారం చూపారు. భారత్‌నగర్‌లో గతంలో వేసిన భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌లో మురుగునీరు, వర్షపు నీరు వెళ్లడానికి మార్గం లేకుండాపోయింది. దీంతో వర్షం వస్తే వీధుల్లో వర్షపు నీరు, మురుగునీరు నిలిచేది. స్థానికులు అనారోగ్యం బారిన పడేవారు. ఈ సమస్యను స్థానికులు సర్పంచ్ పీఎస్ లక్ష్మికి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆమె శాశ్వత ప్రాతిపదికన రూ.12 లక్షలతో మురుగు నీటి కాలువలను నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శనివారం భారత్‌నగర్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అలాగే పట్టణంలోని గంగమ్మ గుడి వద్ద హైమాస్ లైట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓ శివశంకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు పాల్గొన్నారు.

రేనాటి వీరుడు వడ్డెర ఓబన్నకు నివాళి



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వడ్డెర కులస్తులు

వి.కోట: స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు, వడ్డెర కులస్తుల ఆరాధ్య దైవమైన వడ్డెర ఓబన్న అడుగుజాడల్లో నడవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. శనివారం వడ్డెర ఓబన్న జయంతిని పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో మండల వడ్డెర కులస్తులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. పట్టణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరులో స్వాతంత్ర్య సమరయోధులు వడ్డెర ఓబన్న 218 జయంతిని రైతుసేవాకేంద్రం వద్ద ఘనంగా నిర్వహించారు. స్థానిక వడ్డెర కులస్తులు ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘనేత స్వతంత్రబాబు, బీసీ ఉద్యోగుల సంఘ జిల్లా నేత లక్ష్మీపతి, ఎంబీసీ నేతలు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



కుప్పంరూరల్: కుప్పం డిగ్రీ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో కళాశాలకు విచ్చేసి రంగవల్లులు వేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గులు, ఉట్టికొట్టడం వంటి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ సుధారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యాయం చేసేవరకు దీక్ష విరమించం



నిరసన తెలుపుతున్న స్థానికులు

కుప్పంరూరల్: అధికారులు తమకు న్యాయం చేసేవరకు దీక్షలు విరమించేది లేదని నిరసనకారులు తేల్చి చెప్పారు. మండలంలోని ఆవులనత్తం జెల్లి ఫ్యాక్టరీ వల్ల తమ పొలాలు, ఇళ్లకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని స్థానికులు నిరసనకు దిగిన విషయం విదితమే. శనివారం 6వ రోజు కూడా వారు నిరసన కొనసాగించారు. కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నిరసనకారులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుమ్ము తాము సాగు చేసిన పంటలపై పడి పంటలు చేతికి రావడం లేదని, పేలుళ్ల ధాటికి ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని వాపోయారు. గత సోమవారం నుంచి 30 మంది రైతులు నిరసన చేస్తున్నా.. అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు జెల్లి ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం తమకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, వారి కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి





సదుం: నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఆలయంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి

సదుం: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రాతివారిపల్లె అయ్యప్పస్వామి ఆలయానికి శనివారం వారు వచ్చారు. భక్తులతో కలసి అన్న ప్రసాదం స్వీకరించారు. పలువురు తమ సమస్యలపై వినతులు అందించారు. అనంతరం పలువురు నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీలు ధనుంజయ రెడ్డి, సురేంద్రనాథ రెడ్డి, నాయకులు రెడ్డెప్ప రెడ్డి, ప్రకాష్ రెడ్డి, నారాయణ రెడ్డి, పుత్రాజు, గిరిధర్ రెడ్డి, మల్లికార్జున, ఇమ్రాన్, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేతో పార్టీ నేతల భేటీ





ఎంపీ మిథున్‌రెడ్డితో రామకృష్ణారెడ్డి, మాజీమంత్రి పెద్దిరెడ్డితో రాజశేఖర్‌రెడ్డి

పుంగనూరు: వైఎస్సార్‌సీపీకి నూతనంగా నియమించబడిన నాయకులు శనివారం మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, ఎంపీ మిథున్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణ పర్యటనకు వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేను జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, సుబ్బన్న కలిశారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని వారు నూతన కమిటీ నేతలకు సూచించారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా శనివారం తిరుపతిలో ఆయన నివాసంలో ముర్వత్ బాషా పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి పెద్దిరెడ్డిని, ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఘనంగా వాలీబాల్ పోటీలు



క్రీడాకారులతో బీజేపీ నేతలు

రామకుప్పం: కేంద్రప్రభుత్వం నేతృత్వంలో చిత్తూరు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్థానిక డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను గుర్తించి వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. అదేవిధంగా మండలస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి ప్రదీప్, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



నాటి జమీందార్ల కోట పుంగనూరు

- పుంగనూరు జమీందార్ల పాలన నేటికీ ఆదర్శం
- జిల్లాలోనే రెండో ప్రసిద్ధపుణ్యక్షేత్రం బోయకొండ





బోయకొండ ఆలయం

పుంగనూరు: జిల్లా చరిత్రలో పుంగనూరు జమీందారులు సుగుటూరు వంశస్తులు కీలకపాత్ర పోషించారు.క్రీ.శ.600 ఏళ్ల నుంచి పుంగనూరు జమీందారి పాలన పలమనేరు, సదుం, మదనపల్లె వరకు కొనసాగింది. సుగుటూరు వంశస్తులైన రణభైరేగౌడు జమీందారు తొలిసారిగా కర్ణాటకలో ఉన్న సుగుటూరు ప్రాంతాన్ని పాలించి, అక్కడి నుంచి సుగుటూరు వంశస్తులు పుంగనూరులో వచ్చి స్థిరపడి ఇక్కడా జమీందారి పాలన సాగించారు. అలాగే వారి కులదేవత సుగుటూరు గంగమ్మ జాతర ఏటా మార్చి నెలలో వైభవంగా జరుగుతుంది. జమీందారులు ఈ ప్రాంత వాసులకు వేలాది ఎకరాల భూములను ఇనాములుగా ఇచ్చారు. చెరువులు, ఆలయాలు నిర్మించి, రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

విస్తరించిన పట్టణం..

ఒకనాడు చిన్నగా ఉన్న పట్టణం నేడు విస్తరించింది. జనాభా 65వేలకు చేరింది. జమీందారులు ఏర్పాటు చేసిన చెరువులు, ఆలయాలు, రోడ్లు, కాలగర్భంలో కలిసిపోయాయి. గత ఐదేళ్లలో పుంగనూరు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది.

మొలల స్పెషలిస్ట్‌గా డాక్టర్ సొనాటన్

పుంగనూరు: పట్టణంలోని నాగపాళెంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ సొనాటన్ మొలలకు ప్రత్యేక చికిత్స అందిస్తూ మన్ననలు పొందుతున్నారు. ఎలాంటి ఆపరేషన్ లేకుండా ఆయుర్వేద మందులతోనే వ్యాధిని నయం చేయడం ఈయన ప్రత్యేకత. స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం చేస్తారు.

ఫిజియోథెరపీలో ప్రశాంత్ సేవలు అదుర్స్

పుంగనూరు: పట్టణంలోని డాక్టర్ ప్రశాంత్ ఫిజియోథెరపీ సేవలు అందిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో ఉన్న ప్రశాంత్ క్లినిక్‌లో డాక్టర్ ప్రశాంత్ గతంలో యశోద ఆస్పత్రిలో విశేష అనుభవం గడించారు. స్థానిక ప్రజల కోసం పుంగనూరు, చౌడేపల్లెలో ఫిజియోథెరపీ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈయన ప్రధానంగా వెన్నెముక నొప్పి, భుజం, మోచేయి, నడుము, మోకాళ్ల నొప్పులు తగ్గించడంలో విశేషంగా ఫిజియోథెరపీ చేస్తారు.



రిజర్వాయర్ నిర్మాణంతో సాగుకు అవకాశం..

కరువు ప్రాంతమైన నియోజకవర్గ ప్రజలకు తాగునీరు-సాగునీరు అందించేందుకు రూ.500 కోట్లతో నేతిగుట్లపల్లె వద్ద రిజర్వాయర్ నిర్మించారు. అలాగే సోమల మండలం ఆవులపల్లె వద్ద రూ.350 కోట్లతో రిజర్వాయర్ ఏర్పాటు చేశారు. వీటి ద్వారా సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు.

పర్యాటక కేంద్రంగా ..



జిల్లాలో రెండవ ప్రసిద్ధిక్షేత్రంగా వెలుగొందుతున్న బోయకొండ గంగమ్మ ఆలయాన్ని సుమారు రూ.500 కోట్లతో అభివృద్ధి చేశారు. అలాగే మండలంలోని నెక్కుంది శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయం, సోమల మండలంలోని గార్గేయ మునీశ్వరస్వామి ఆలయం, పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, పుంగనూరు శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలను ఎంతో సుందరంగా నిర్మించారు.

నాగరికతను సూచిస్తున్న రహదారులు..

పుంగనూరు పట్టణానికి ఎంబీటీ రోడ్డును అనుసంధానం చేస్తూ రూ.1600 కోట్లతో బైపాస్‌రోడ్డును ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలో రూ.5 కోట్లతో మినీ బైపాస్‌రోడ్డును ఏర్పాటు చేశారు. జమీందారుల కాలం నుంచి ఉన్న పట్టణాన్ని రూ.10 కోట్లతో విస్తరించారు. అలాగే పుంగనూరుకు కర్ణాటక ఎక్స్‌ప్రెస్ హైవేను అనుసంధానం చేశారు. ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, కాలువలు, లింక్ రోడ్లు ఏర్పాటు చేశారు.

పరిశ్రమల ఏర్పాటుతో ఊతం..

పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద సుమారు పదివేల ఎకరాలలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు. శ్రీకాళహస్తి ఫేరా ఆలాయ్ పరిశ్రమ రూ.250 కోట్లతో నిర్మించి, ఉత్పత్తులు ప్రారంభించింది. దీంతో పుంగనూరులో పరిశ్రమల స్థాపనలో తొలి అడుగు ప్రారంభమైంది.

సోలార్‌తో మరింత వన్నె..

మున్సిపాలిటీలో రూ.5 కోట్లతో సోలార్ ప్రాజెక్టును నిర్మించి, తద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను మున్సిపాలిటీకి వినియోగిస్తున్నారు. దీంతో ప్రతినెలా మున్సిపాలిటీకి రూ.15 లక్షలు విద్యుత్ బిల్లులు ఆదా అవుతోంది.